## క్లుప్తంగా

### డిప్యూటీ తహసీల్దార్‌గా ధరణిషా



**మానవపాడు:** మండలంలోని రెవెన్యూ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా ధరణిషా మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

### నేటి నుంచి నిరాహార దీక్ష

**రాజోళి:** మండలంలో జూనియర్ కాలేజీ ఏర్పాటు చేయాలని కోరుతూ కళాశాల సాధన సమితి ఆధ్వర్యంలో బుధవారం నుంచి నిరాహార దీక్ష చేపడుతున్నట్లు సమితి కన్వీనర్ ఈశ్వరయ్య తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో 11 గ్రామ పంచాయతీల్లో పదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు జూనియర్ కళాశాల లేక ఉన్నత విద్యాభ్యాసాలకు దూరం అవుతున్నారన్నారు. ఎన్నో సార్లు ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలు ఇచ్చినా స్పందించకపోవడంతోనే నిరాహార దీక్ష చేయాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. అన్ని గ్రామాల ప్రజలు దీక్షలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో జయన్న గౌడ్, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

### దివ్యాంగులకు బస్సు పాసులు



**మల్దకల్:** మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం దివ్యాంగులకు రాయితీ బస్సు పాస్‌లను గద్వాల డిపో మేనేజర్ శ్రీనివాస్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం దివ్యాంగులకు బస్సు చార్జీలో 50 శాతం రాయితీ కల్పించిందన్నారు. బస్సు పాసులను సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచు యాకోబు, ఉప సర్పంచు మల్దకల్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా ప్రపంచ మలేరియా దినోత్సవం



**మానవపాడు:** మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం డాక్టర్ రిజ్వాన తన్వీర్ ఆధ్వర్యంలో ప్రపంచ మలేరియా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ తీశారు. మలేరియా వ్యాధిపై అవగాహన కల్పించారు. దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సత్యానారాయణ, చంద్రన్న, తిరుమాల్‌రావు, ఏఎన్‌ఎం, ఆశలు తదితరులు పాల్గొన్నారు.

### కొనసాగుతున్న కంటి వెలుగు

**గట్టు:** మండలంలోని ఆరగిద్ద, తారాపురం ఇందువాసి గ్రామాల్లో కంటి వెలుగు శిబిరాలు కొనసాగుతున్నాయి. మూడు గ్రామాల్లో మొత్తం 452 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 26 మందికి కంటి అద్దాలను పంపిణీ చేయగా, 41 మందికి అద్దాల కోసం ప్రతిపాదనలు పంపినట్లు వైద్యాధికారులు తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారులు తిమ్మప్ప, సౌజన్య, నర్సింహులు, సూపర్‌వైజర్లు మక్బూద్, స్వర్ణలత, బాలమ్మ, ఏఎన్‌ఎంలు రేష్మ, ఈశ్వరమ్మ, నర్మద, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

### వేతనాలు అందక ఇబ్బందులు



**పెబ్బేరు:** మండలంలోని వై.శాఖాపూర్‌లో మన ఊరు, మన గుడి కార్యక్రమంపై అర్చకులు మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అర్చకుల సంఘం అధ్యక్షుడు వాసుదేవశర్మ ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షుడు పీవీ లక్ష్మీకాంతాచార్యులు మాట్లాడుతూ ఆలయ పరిరక్షణ, పలు సమస్యలపై చర్చించారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం దూపదీప నైవేద్యాలకు ఇస్తున్న రూ.రెండు వేలు, వేతనాలు అందకపోవడం, పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైన ప్రభుత్వం రూ. 22 వేతనం పెంచాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు నటరాజ్, కోశాధికారి రవీంద్రరావు, వెంకటేశ్వర్లు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

# దేశానికే తెలంగాణ ఆదర్శం

- బీఆర్‌ఎస్ జిల్లా ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ తక్కలపల్లి రవీందర్‌రావు

**సాక్షి, నెట్‌వర్క్:** జిల్లా వ్యాప్తంగా బీఆర్‌ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన ప్లీనరీ సమావేశానికి బీఆర్‌ఎస్ జిల్లా ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ తక్కలపల్లి రవీందర్‌రావు, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి హాజరై మాట్లాడారు. దేశానికే తెలంగాణను రోల్‌మాడల్‌గా మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. గత తొమ్మిదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఎమ్మెల్యే చదివి వినిపించారు. అనంతరం గద్వాల, మల్దకల్ మండలాలోని పలువురు ఇతర పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరారు. అదేవిధంగా గట్టు మండలం చాగదోనలోఎంపీపీ విజయ్‌కుమార్, బోయలగూడెంలో వైస్ ఎంపీపీ సుమతి బల్గెరలో జెడ్పీటీసీ బాసు శ్యామల, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు హనుమంతునాయుడు, గట్టులో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రామృష్ణారెడ్డిలు బీఆర్‌ఎస్ జెండాను ఆవిష్కరించారు. మల్దకల్ మండలంలోని వివిధ గ్రామాల్లో పార్టీ జెండాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయా గ్రామాలలోని గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలంపూర్ మున్సిపాలిటీలోని గాంధీ చౌక్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ, పార్టీ కార్యాలయ ఆవరణలో పట్టణ అధ్యక్షుడు వెంకట్రామయ్య శెట్టి బీఆర్‌ఎస్ జెండాను ఆవిష్కరించారు. ఇటిక్యాల మండలంలోని ఎర్రవల్లి చౌరస్తాలో నాయకులు రాఘున్న, కృష్ణాసాగర్, కేటీదొడ్డి మండల కేంద్రంలో జెడ్పీటీసీ రాజశేఖర్, శాంతినగర్, అయిజ, ఉండవెల్లి, రాజోళిలోని మండల అధ్యక్షులు, సర్పంచ్‌లు జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ సరోజమ్మ, ఎమ్మెల్యే సతీమణి సర్పంచు బండ్ల జ్యోతి, రాష్ట్ర వినియోగదారుల ఫోరం చైర్మన్ గట్టు తిమ్మప్ప, రామన్‌గౌడ్, శ్రీధర్‌గౌడ్, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు చెన్నయ్య, ఎంపీపీలు ప్రతాప్‌గౌడ్, విజయ్, నజమున్నీసా బేగం, మనోరమ్మ, రాజారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, కౌన్సిలర్లు మురళి, శ్రీను, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, ఎమ్మెల్సీ రవీందర్‌రావు



గట్టు మండలం బల్గెరలో..



మల్దకల్‌లో..



అలంపూర్‌లో ..



ఎర్రవల్లి చౌరస్తాలో ..



కేటీదొడ్డిలో..

# పారిశుద్ధ్యానికి ప్రాధాన్యం

**అయిజ:** పారిశుద్ధ్యానికి ప్రాధాన్యం ఇస్తున్నామని మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్న అన్నారు. మంగళవారం 2వ వార్డులో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా డ్రెయినేజీలను, సీసీ రోడ్లను ఆయన పరిశీలించారు. వార్డులోని ఆయా కాలనీవాసులతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మురుగుకాలువలు నిర్మించాలని, సరిపడ తాగునీరు సరఫరా చేయడం లేదని చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. త్వరలో వార్డులో నెలకొన్న సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.



మురుగును పరిశీలిస్తున్న చిన్న దేవన్న

# ఆర్టిజన్ కార్మికుల నిరసన



రాజోళి పోలీస్‌స్టేషన్‌లో ఆర్టిజన్ కార్మికులు



అలంపూర్ చౌరస్తాలో ..

**అలంపూర్:** ఆర్టిజన్ల ప్రాతినిధ్య సంఘాల పిలుపు మేరకు పట్టణంలో ఆర్టిజన్ కార్మికులు మంగళవారం సమ్మె నిర్వహించారు. స్థానిక ప్రకృతి నగర్‌లో కార్మికులు తమ డిమాండ్లను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే నిరసనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మహబూబ్ బాషా, జమాల్ బాషా, రహమత్, గౌరీ శంకర్, గౌరీశ్వరయ్య, రామచంద్రుడు, రాజేంద్ర కుమార్, 132 కేవీ కార్మికులు అలి పిర, అశోక్, బాలనాగరాజు, నరసింహ ఉన్నారు.

**రాజోళి:** సమస్య సాధన కోసం ఆర్టిజన్ కార్మికులు సమ్మె చేసేందుకు సిద్ధం అవుతున్న నేపథ్యంలో మంగళవారం పోలీసులు ముందస్తు అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ 20 ఏళ్లుగా పనిచేస్తున్నా కనీస వేతనం చెల్లించడం లేదని వాపోయారు. అక్రమంగా అరెస్టు చేసిన సమ్మె విరమించమని హెచ్చరించారు. అరెస్టు అయిన వారిలో శివప్రసాద్, రాముడు, సునీల్, రవీందర్, లక్ష్మన్న, వెంకటేష్, మహేష్ తదితరులు ఉన్నారు.

# విద్యార్థులకు శిక్షణ తరగతులు



విద్యార్థులతో హెచ్‌ఎం విజయసారథిరెడ్డి

**శాంతినగర్:** విద్యార్థుల సామర్థ్యాలు పెంచడానికే వేసవి శిక్షణ తరగతులు ఏర్పాటు చేస్తునట్లు ప్రధానోపాధ్యాయులు విజయసారథిరెడ్డి తెలిపారు. వడ్డేపల్లి మున్సిపాలిటీ శాంతినగర్ ప్రాథమిక పాఠశాలలో చదువుతూ విద్యలో వెనుకబడిన 4, 5 తరగతుల విద్యార్థుల కోసం ఎంవీ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేక వేసవి తరగతులను మంగళవారం ఆయన ప్రారంభించారు. పిల్లల విద్యాభ్యాసానికి తల్లిదండ్రులు సహకరించి ప్రతిరోజు వేసవి తరగతులకు పంపాలని కోరారు. ఉపాధ్యాయురాలు రమ్యశ్రీ, ఎంవీ ఫౌండేషన్ సభ్యుడు వెంకటేష్, విద్యాకమిటీ చైర్మన్ కర్రెప్ప, వాసవీక్లబ్ మాజీ చైర్మన్ గాయత్రి శ్రీనివాసులు, సప్తగిరి శ్రీనివాస్, రవి, నర్సింహ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# భూసార పరీక్షలు అంతేనా?



పొలాన్ని దుక్కి చేస్తున్న రైతు(ఫైల్)

**ఉండవెల్లి:** పంటలు అధిక దిగుబడులు సాధించాలంటే భూములకు భూ సార పరీక్షలు తప్పనిసరి. ఈ పరీక్ష ద్వారా ఏ రకమైన భూముల్లో ఎంత మోతాదులో ఎరువులు వాడాలో తెలుస్తుంది. వ్యవసాయంలో ఎంతో కీలకమైన భూసార పరీక్షపై కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శలు వినిపిస్తున్నాయి. రైతులు అవగాహన లేక పంటలకు రసాయనిక ఎరువులు వాడి నష్టపోతున్నారు.

**నిలిచిన రసాయనాల సరఫరా**

అలంపూర్ నియోజకవర్గంలో 7 మండలాల పరిధిలో సుమారు 3.50 లక్షల ఎకరాల సాగుకు అనుకూలమైన భూములు ఉన్నాయి. రైతులు ఏటా సుమారు 2.50 లక్షల ఎకరాల్లో పంటలు పండిస్తున్నారు. గతంలో ప్రతి వానాకాలం సీజన్‌కు ముందే వ్యవసాయ శాఖ భూసార పరీక్షల కోసం శాంపిల్స్ సేకరించేది. విశ్లేషణ తర్వాత ఫలితాలను తెలిపి ఏ పంటలు వేయాలో వివరించేవారు. మూడేళ్ల కిందట క్లస్టర్ పరిధిలో 50 చొప్పున భూసార పరీక్ష కిట్లను పంపిణీ చేసింది. సాగు భూములో నమునాలు సేకరించి భూసార పరీక్షలు నిర్వహించారు. అప్పటి నుంచి ఇప్పటివరకు ఎటువంటి భూసార పరీక్షలు చేయడం లేదు.

**అవగాహన లేక పరీక్షలకు దూరం..**

భూసార పరీక్షల ప్రయోజనాలపై అవగాహన లేని రైతులు పరీక్షలు చేయించుకునేందుకు ముందుకు రావడంలేదు. స్థానికంగా అందుబాటులో లేకపోయిన ఉమ్మడి జిల్లాలో ఒక భూసార పరీక్ష కేంద్రాన్ని ప్రభుత్వం రైతులకు అందుబాటులో ఉంచింది. గతంలో మాదిరిగా ప్రభుత్వం వ్యవసాయ శాఖకు ప్రత్యేకంగా ఎలాంటి లక్ష్యాన్ని నిర్దేశించకపోవడంతో ఆ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు.

### పరీక్ష పరికరాలు లేవు



రైతు వేదికలో భూసార పరీక్షలకు సంబంధించిన పరికరాలు లేవు. రైతులకు అవగాహన కల్పించేందుకు అప్పుడప్పుడు అధికారులు సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. మూడేళ్లుగా భూసార పరీక్షలు చేయడం లేదు. భూసార పరీక్షలు నిర్వహించాలి. అధిక దిగుబడులు సాధించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

– శివ, రైతు, ఉండవెల్లి

### పైలెట్ గ్రామాలుగా ఎంపిక

ప్రతి మండలంలో రెండు మూడు గ్రామాలను పైలెట్ గ్రామాలుగా ఏర్పాటు చేసి భూసార పరీక్షలకు పంపుతున్నాం. జడ్చర్లలో మట్టిని సేకరించి, ఏ పంటలు వేస్తే ఎలాంటి ఫలితాలు వస్తాయో శాస్త్రవేత్తలు తెలిపేందుకు అప్పుడప్పుడు మండలాలకు వచ్చి తెలుసుకుంటారు. రైతులు ఎక్కడైన పరీక్షలు నిర్వహించుకోవచ్చు. 2018, 19 సంవత్సరంలో భూసార పరీక్షలు చేశాం. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం అమలు చేయడం లేదు.

– సక్రియనాయక్, ఏడీఏ, అలంపూర్

### జాబ్‌మేళాలో 18 మంది ఎంపిక

**అలంపూర్:** మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పాలమూరు యూనివర్సిటీలో మంగళవారం నిర్వహించిన జాబ్‌మేళాలో మండల కేంద్రంలోని విశ్వశాంతి డిగ్రీ కళాశాల విద్యార్థులు 18 మంది ఎంపికయ్యారు. ఈసందర్భంగా పర్యాటక, ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, యూనివర్సిటీ వైస్ చాన్సలర్ లక్ష్మీకాంత్ రాథోడ్‌లు విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో విశ్వశాంతి డిగ్రీకళాశాల కరస్పాండెంట్ మురళీధర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ కోటేశ్వరరావు, ఏఓ సునీల్, ప్లేస్‌మెంట్ అధికారి ప్రత్యూషలు పాల్గొన్నారు.

# సమస్యలు పరిష్కరించాలి

**మల్దకల్:** నాలుగేళ్లు పూర్తి చేసుకున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు రాఘవేంద్ర, సత్యానారాయణలు డిమాండ్ చేశారు. మంగళవారం జూనియర్ పంచాయతీ కార్యదర్శులు మల్దకల్ ఎస్‌ఐ శేఖర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. భవిష్యత్‌లో సమ్మె చేసే అవకాశం ఉందని దీనికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు అంజనేయులు, పరుశురాముడు, అయ్యపురెడ్డి, హారిక, మారెప్ప, లావణ్య సరిత, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.



ఎస్‌ఐ శేఖర్‌కి వినతి పత్రాన్ని అందజేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు

# కళ్లకు గంతలు కట్టుకొని నిరసన



గద్వాలలో కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలుపుతున్న వీఓఏలు

**గద్వాల అర్బన్:** జిల్లా కేంద్రంలోని మెప్మా కార్యాలయం ఎదుట తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వీఓఏలు చేపడుతున్న నిరవధిక సమ్మె తొమ్మిదోరోజు మంగళవారం కొనసాగింది. ఈ సందర్భంగా వీఓఏలు కళ్లకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. సమ్మెలో వీఓఏలు వెంకటేష్, లక్ష్మన్న, తిమ్మప్ప, సుధాకర్, కళావతమ్మ, సౌమ్య, సుమలత తదితరులు ఉన్నారు.

**మల్దకల్:** మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య భవనం ఎదుట నిర్వహిస్తున్న సమ్మెలో వీఓఏలు కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. కార్యక్రమంలో వీఓఏల సంఘం మండల నాయకులు బాషా, చంద్రాములు వీఓఏల సంఘం సభ్యులు తిమ్మప్ప, గోవిందు, లోకనాథ్, మునిస్వామి, హనుమంతు, వెంకట్రాములు, అపర్ణ, నవీన, ఏస్తేర్, తిరుమలేష్, మహేందర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

**కేటీదొడ్డి:** వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని సంఘం మండల అధ్యక్షుడు తిమ్మప్ప డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో కొనసాగుతున్న సమ్మె శిబిరంలో వీఓఏలు కళ్లకు నల్ల బ్యాడ్జీలు కట్టుకుని నిరసన తెలిపారు. కార్యక్రమంలో కిరణ్, శ్రీనివాసులు, తిరుమల్, తదితరులు పాల్గొన్నారు.



గట్టులో..



కేటీదొడ్డిలో..



మల్దకల్‌లో..

**గట్టు:** మండల కేంద్రంలోని మండల మహిళా సమాఖ్య ఎదుట మంగళవారం వీఓఏలు కళ్లకు నల్ల గుడ్డలను కట్టుకుని నిరసన తెలిపారు. సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

### కేసు నమోదు

**అమరచింత:** పట్టణంలోని బీసీ కాలనీలో నివాసం ఉంటున్న పర్జానా బేగం ఇంటి తలుపులు, గోడను పగలగొట్టిన నిస్సార్ అనే వ్యక్తితో పాటు మరో ఇద్దరిపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ శివనాగేశ్వరనాయుడు తెలిపారు. ఆదివారం నసీర్ ఇంట్లో ఎవ్వరూ లేకపోవడంతో మూసి ఉన్న ఇంటి తలుపులతో పాటు గోడను నిసార్ పగలగొట్టాడు. దీంతో నసీర్ భార్య పర్జానాబేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

### నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం తగదు



**అమరచింత:** మహబూబ్‌నగర్‌లో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించే నిరుద్యోగ మార్చ్‌లో పాల్గొనేందుకు అమరచింత, ఆత్మకూర్ మండలాల నుంచి నాయకులు మంగళవారం పాలమూర్‌కు తరలివెళ్లారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిరుద్యోగులు జీవితాలతో ఆటలాడుతుందని, ఇప్పటి వరకు టీచర్ పోస్టుల కోసం నోటిఫికేషన్ వేయలేదని బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి మేర్వరాజు అన్నారు. నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం బీజేపీ నిర్వహించే నిరుద్యోగ మార్చ్ కార్యక్రమానికి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ హాజరవుతున్నారని తెలిపారు.

**మదనాపురం:** మహబుబ్‌నగర్ జిల్లా కేంద్రంలో మంగళవారం జరిగిన నిరుద్యోగ మార్చ్ కార్యక్రమానికి దేవరకద్ర బీజేపీ నాయకుడు ఎగ్గని నరసింహులు ఆధ్వర్యంలో కార్యకర్తలు తరలివెళ్లారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, మండల అధ్యక్షుడు కృష్ణ యాదవ్, ప్రధాన కార్యదర్శి రాము, మండల ఉపాధ్యక్షుడు వెంకటేష్, ఉపసర్పంచ్ రామకృష్ణారెడ్డి, భాస్కర్, మల్లేష్, శివ, రామకష్ణ, రమేష్, శివ ఉన్నారు.

**కొత్తకోట రూరల్:** ప్రశ్న పత్రాల లీకేజీకి నిరసనగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో భారతీయ జనతా పార్టీ మంగళవారం నిర్వహిస్తున్న నిరుద్యోగ మార్చ్‌లో పాల్గొనేందుకు పెద్దమందడి మండలం నుంచి నిరుద్యోగులు, బీజేపీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు.



# ముగిసిన సువార్త మహాసభలు

**మానవపాడు:** మండలంలోని చెన్నిపాడు ఎంబీబీబీ బేతేలు చర్చి పాస్టర్ చార్లెస్ ఆధ్వర్యంలో మంగళవారం మూడో రోజు ముగింపు సువార్త మహాసభలకు ముఖ్యఅతిథిగా అంతర్జాతీయ ప్రసంగీకులు జాన్ వెస్లీ హాజరై మాట్లాడారు. ప్రతి ఒకక్కరితో సోదరభావంతో మెలిగి దేవునిపై నమ్మకం కలిగి ఉండాలని అన్నారు. యేసుప్రభువు బోధనలు ఆచరించి ఆయన సన్నిధిలో సేవకులుగా ఉండాలని సూచించారు. అయిజ, ఇటిక్యాల, అలంపూర్, వడ్డేపల్లి, రాజోలి, ఉండవెల్లి, కర్నూల్ జిల్లా, ఉమ్మడి మహబూబ్‌నగర్, ఇతర ప్రాంతాల నుంచి క్రైస్తవులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. భోజన సౌకర్యం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర కో ఆర్డినేటర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, జెడ్పీ మాజీ చైర్మన్ బండారి భాస్కర్, కిశోర్‌కుమార్, సంఘం పెద్దలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



హాజరైన క్రైస్తవులు